శ్రీ శంకరాచార్య విరచిత

శ్రీ దేవీ నవరత్నమాలికా స్తోత్రమ్

శ్రీరస్తు   శుభమస్తు

- భావార్థముతో -




అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గొతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



Kiron Type Institute

శ్రీ దేవీ నవరత్నమాలికా స్తోత్రమ్ - భావార్థముతో.

01. హారనూపుర కిరీటకుండల విభూషితావయవ శోభినీం
కారణేశ వరమౌళికోటి పరికల్ప్యమాన పదపీఠికామ్।
కాలకాల ఫణిపాశ బాణధనురంకుశామరుణ మేఖలాం
ఫాలభూ తిలకలోచనాం మనసి భావయామి పరదేవతామ్॥

హారములు, అందెలు, కిరీటము, కుండలములు, అలంకరింపబడిన అవయవములతో శోభిల్లుచున్నదీ - ప్రపంచమునకు కారణమైన దేవతల కిరీటములే పాదపీఠముగా కలదీ - యముని సైతం సంహరించు నాగపాశము, బాణము, ధనుస్సు, అంకుశము ధరించినదీ - ఎర్రని వడ్డాణము పెట్టుకున్నదీ - నొసటి యందు తిలకము వంటి మూడవ కన్ను కలదీ - అగు పరదేవతను మనస్సు నందు ధ్యానించుచున్నాను.

మెడలో హారములు, కాలికి అందియలు, శిరసున కిరీటము, కుండలములతో కూడి శోభిల్లు అవయవములు కలది, ముక్కోటి దేవతల కిరీటములను తన పాదపీఠముగా చేసుకున్నది, యముని సంహరించుటకు నాగ పాశము, బాణము, అంకుశమును ధరించినది, వడ్డాణమును ధరించినది, ఫాల భాగమున తిలకమువంటి మూడవ నేత్రము కలది అయిన పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

- - - - - -

02. గంధసార ఘనసారచారు నవనాగవల్లి రసవాసినీం
సాంధ్యరాగ మధురాధరాభరణ సుందరానన శుచిస్మితామ్।
మంథరాయత విలోచనామమల బాలచంద్ర కృతశేఖరీం
ఇందిరారమణ సోదరీం మనసి భావయామి పరదేవతామ్॥

కర్పూరము మొదలైన సుగంధ ద్రవ్యములతో పరిమళించు తమలపాకుల రసముతో సువాసనలు వెదజల్లు నోరుకలదీ - సంధ్యారాగము వలే ఎర్రనైన పెదవిపై

చిరునవ్వే ఆభరణముగా కలదీ - మత్తైన విశాలనేత్రములు కలదీ - బాలచంద్రుడు శిరోభూషణముగా నున్నదీ, విష్ణు మూర్తికి సోదరియైనదీ అగు పరదేవతను ధ్యానించుచున్నాను.

కర్పూరాన్ని సుంగంధ ద్రవ్యములతో కూడిన తాంబూల రసమును గ్రహిస్తూ, ఆ సువాసనలను నలు దిశలా వెదజల్లు నోటితో శోభించునది, సంధ్యాసమయంలోని ఎర్రని కాంతి తన పెదవులపై చిరునవ్వుగా ధరించినది, విశాల నేత్రములు కలది, చంద్రరేఖను శిరస్సు ధరించినది, శిష&ఉణమూర్తికి సోదరియైన నారాయణీ పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

\- - - - - -

03. స్మేరచారు ముఖమండలాం విమల గండలంబి
మణిమండలాం
హారదామ పరిశోభమాన కుచభారభీరు తనుమధ్యమామ్।
వీరగర్వహర నూపురాం వివిధకారణేశ వరపీఠికాం
మారవైరి సహచారిణీం మనసి భావయామి పరదేవతామ్॥

చిరునవ్వుతో అందమైన ముఖము కలదీ - స్వచ్ఛమైన చెంపలపై వ్రేలాడుచున్న మణికుండలములు ధరించినదీ - హారములతో, పూలదండలతో శోభించుచున్న స్తన మండలము; సన్నని నడుము కలదీ - వీరుల గర్వమును పోగొట్టు అందెలు కలదీ - వివిధ దేవతలచే సేవింపబడు సింహాసనముపై అధిష్ఠించినదీ - శివుని సహధర్మచారిణి యగు పరదేవతను మనస్సునందు ధ్యానించుచున్నాను.

ముఖమున ప్రశాంతమైన చిరునవ్వు కలది, కర్ణములకుండి కపోలములవరకు వేలాడు మణికుండలములు కలది, హారములు, పుష్పమాలలతో శోభించు స్థనభాగములు కలది, సన్నదైన నడుముతో శోభించునది, వీరులమని అహంకరించు వారి గర్వమును అణచునది, దేవతలు సేవిస్తుండగా సింహాసనాధీశ్వరి, ఈశ్వరుని ధర్మపత్ని అయిన పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

\- - - - - -

04. భూరిభారధర కుండలీంద్ర మణిబద్ధ భూవలయపీఠికాం
వారిరాశిమణి మేఖలావలయ వహ్నిమండల శరీరిణీమ్।
వారి సారవహ కుండలాం గగనశేఖరీం చ పరమాత్మికాం
చారు చంద్ర రవిలోచనాం
మనసి భావయామి పరదేవతామ్॥

మిక్కిలి భారమును మోయు ఆదిశేషుని పడగలపై నున్న మణులతో పొదగబడిన భూమండలమే పీఠముగా నున్నదీ - సముద్రమునందలి మణులు వడ్డాణముగా గల అగ్ని మండలమే శరీరముగా కలదీ - రత్నకుండలములు ధరించినదీ - ఆకాశమే కిరీటముగా కలదీ - పరమాత్మయైనదీ - అందమైన చంద్రుడు, సూర్యుడు కన్నులుగా కలదీ - అగు పరదేవతను మనస్సునందు ధ్యానించు చున్నాను.

వేయి పడగలపై భూబారమును మోయు ఆదిశేషుని పడగలపై ఉన్న మణులతో కూర్చబడిన భూమిని తన పీఠముతా చేసుకున్నది, మహా సముద్రమునందలి మణులను వడ్డాణముగాను, అగ్నిమండలమును శరీరముగాను, విశాల ఆకాశమును కిరీటముగా ధరించినది, సూర్య చంద్రులను నేత్రములుగా కలిగిన పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

- - - - - -

05. కుండల త్రివిధ కోణమండల విహారషడ్దల సముల్లస
పుండరీక ముఖభేదినీం తరుణచండభాను తడిదుజ్జ్వలామ్।
మండలేందు పరివాహితామృత తరంగిణీ మరుణరూపిణీం
మండలాంత మణిదీపికాం
మనసి భావయామి పరదేవతామ్॥

కుండలము వలే ఉన్న త్రికోణమండలమునందు సంచరించు అరురేకుల పద్మమును వికసింప చేయునదీ - సూర్యునివలే, మెరుపువలే ప్రకాశించుచున్నదీ - చంద్రమండలము

నందు ప్రవహించు అమృతనదియైనదీ - ప్రకాశించు మణిదీపమైనదీ అగు పరదేవతను మనస్సు నందు ధ్యానించుచున్నాను.

కుండలము వంటి త్రికోణ మండలములోని షట్రేకుల పద్మమును శోభిల్లజేయునది, సూర్యుడు, మెరుపులు తన ప్రకాశముగా కలిగినది, చంద్రమండలములోని అమృత ప్రవాహముగా, ఎర్రని కాంతితో ప్రకాశించునది, శ్రీ చక్రములోని మణిదీప వాసినియైన పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

- - - - - -

06. వారణానన మయూరవాహ ముఖదాహవారణ పయోధరాం
చారణాది సురసుందరీ చికురశేఖరీకృత పదాంబుజామ్।
కారణాధిపతిపంచక ప్రకృతికారణప్రథమ మాతృకాం
వారణాన్తముఖ పారణాం మనసి భావయామి పరదేవతామ్॥

వినాయక, సుబ్రహ్మణ్యుల దాహమును దీర్చు పాలిండ్లు కలదీ, దేవతా స్త్రీల కేశము లందు అలంకారముగా నున్న పాదపద్మములు కలదీ - జగత్కారణులైన దేవతలకు కూడ మూపకారణమైనదీ - ఐశ్వర్యమును అనుభింపచేయునదీ అగు పరదేవతను మనస్సు నందు ధ్యానించు చున్నాను.

తన ఇరువురు తనయులైన వినాయకుడు, షణ్ముఖుల ఆకలిని తీర్చు మాతృ స్థానములు కలది, దవతా స్త్రీల కోశపాశములతో కొలువైన పాద పద్మములు కలది, సమస్త దేవతలకు మూలభూతురాలైనది, ఐశ్వర్యప్రదాత అయిన పరదేవతను మనః పూర్వకముగా ధ్యానించుచున్నాను.

- - - - - -

07. పద్మకాంతిపద పాణిపల్లవ పయోధరానన సరోరుహాం
పద్మరాగ మణిమేఖలావలయ నీవిశోభిత నితంబినీమ్।
పద్మసంభవ సదాశివాన్తమయ పంచరత్న పదపీఠికాం
పద్మినీం ప్రణవ రూపిణీం మనసి భావయామి పరదేవతామ్॥

పద్మములవంటి పాదములు, చిగురుటాకులవంటి చేతులు, తామరల వంటి స్తనములు, కలిగిన ముఖము కలదీ - పద్మరాగమణుల ఒడ్డాణమును ధరించినదీ - బ్రహ్మ మొదలు సదాశివుని వరకు ఉన్న దేవతలు పాదపీఠముగా ఉన్నదీ - ఉత్తమ స్త్రీమూర్తియూ, ఓంకార స్వరూపిణియగు పరదేవతను మనస్సు నందు ధ్యానించు చున్నాను.

పద్మములను బోలిన పాదములు, లేత చిగుళ్లవంటి హస్తములు, తామరలవంటి కుచభాగములు, అందమైన ముఖము కలిగి, పద్మరాగమణులను వడ్డాణములో పొదుగు కున్నది. బ్రహ్మ, ఈశ్వరుడు తదితర దేవతలు తన పాదపీఠముగా కలిగినది, స్త్రీ రత్నము, ఓంకార స్వరూపిణి అయిన పరదేవతను మనఃపూర్వకముగా ధ్యానించు చున్నాను.

- - - - - -

08. అగమప్రణవ పీఠికామమల వర్ణమంగళ శరీరిణీం
ఆగమావయవ శోభినీ మఖిలవేదసార కృతశేఖరీమ్।
మూలమంత్ర ముఖమండలాం
ముదితనాద బిందునవయౌవనాం
మాతృకాం త్రిపుర సుందరీం మనిసి
భావయామి పరదేవతామ్॥

వేదములందని ఓంకారము పీఠముగా కలదీ - స్వచ్ఛమైన మంగళ శరీరము కలదీ - వేదములే అవయవములుగా కలదీ - సమస్త వేదసారము శిరోభూషణముగా ధరించినదీ - మూలమంత్రమే ముఖముగా నున్నది - నాదబిందువులే నవ యౌవనముగా నున్నదీ - జగన్మాతయైనదీ అగు త్రిపురసుందరరిని మనస్సునందు ధ్యానించుచున్నాను.

స్వయముగా వేదాంతర్గతమైన ఓంకారమును పీఠముగా కలగినది, పవిత్రము, మంగళము అయిన శరీరము కలది, వేదములను అవయవములుగా కలది, వేదములలో

సమస్త సారమును తన శిరోభాగమున ధరించినది, మూల మంత్రాన్ని తన ముఖంగా కలిగినది అయిన మహా త్రిపురసుందరిని మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

\- - - - - -

09\. కాళికాతిమిర కుంతలాంత ఘనభృంగ మంగళవిరాజినీం
చూలిభాశిఖర మాలికావలయ మల్లికాసురభి సౌరభామ్।
వాలికామధుర గండమండల మనోహరానన సరోరుహాం
కాళికామఖిల నాయికాం మనసి భావయామి పరదేవతామ్॥

మేఘములు, తుమ్మెదలు వంటి నల్లని కేశ పాశముతో విరాజిఉల్లచున్నదీ - కొప్పులో అలంకరించుకున్న మల్లెల సువాసనలు కలదీ - అందమైన చెంపలున్న మనోహరమగు ముఖము కలదీ - సమస్తలోకములకూ నాయకురాలగు కాళికా అను పరదేవతను మనస్సునందు ధ్యానించు చున్నాను.

నల్లని దట్టమైన మేఘములు, తుమ్మెదలవంటి కేశపాశముతో శోభించుచున్నదీ, ఆ కేశములు కొప్పులో అమరిన సుగంధరూపిరతమైన మల్లెపూలవాసన కలది, అందమైన కపోల భాగము కలది, త్రిభువనాధీశ్వరి అయిన కాళికాదేవిని మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

\- - - - - -

10\. నిత్యమేవ నియమేన జల్పతాం
భుక్తిముక్తిఫలదా మభీష్టదామ్।
శంకరేణ రచితాం సదా జపే
నామరత్న నవరత్నమాలికామ్॥

భుక్తిని ముక్తిని కలిగించునదీ, అభీష్టము నెరవేర్చునదీ, శంకరాచార్యునిచే రచించబడినదీ అగు ఈ నవరత్న మాలికా అను స్తోత్రమును నిత్యము నియమముతో పారాయణ చేయవలెను.


Kiron Type Institute

భుక్తి, ముక్తులను ప్రసాదించునది, సమస్త కోరికలను నెరవేర్చునది, ఆది శంకరులచే ప్రకటించబడినది అయిన ఈ నవరత్న మాలికను అనుదినము మనఃపూర్వకముగా స్మరిస్తాను.

- - - - - -

ఇతి జగద్గురు శ్రీ ఆదిశంకర విరచిత శ్రీదేవీ నవరత్నమాలికా స్తోత్రము సంపూర్ణమ్

- - - = - - -




కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్









(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. --- 994 994 1430 OR 944 044 9650)

Kiron Type Institute